క్లుప్తంగా

వైభవంగా సుదర్శన హోమం



విజయవాడ కల్చరల్: లోక కల్యాణార్థం కంచి కామకోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర, వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ నిర్వాహకుడు డాక్టర్ రామ్మోనరావు మాట్లాడుతూ శ్రీ మహావిష్ణువు ఆయుధం సుదర్శనమని తెలిపారు. అది దుష్టలను శిక్షిస్తూ, భక్తులను రక్షిస్తుందన్నారు. సుదర్శన హోమం వల్ల దీర్ఘవ్యాధుల నుంచి విముక్తి కలుగుతుందని చెప్పారు. దైవిక రక్షణ, సకల శుభాలు కలుగుతాయని పేర్కొన్నారు. దేవాలయం మేనేజర్ శర్మ, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మాగంటి వేణుగోపాల్ పాల్గొన్నారు.

14 నుంచి సప్త శనివారార్చన

విజయవాడ కల్చరల్: శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో భారతీ తీర్థ మహాస్వామి, విదుశేఖర భారతిస్వామి ఆదేశంతో 14 వ తేదీ శనివారం నుంచి జూలై 26 వ తేదీ వరకు శివరామకృష్ణ సముదాయంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తునట్లు ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు స్వయంగా పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

పెనమలూరు: పోరంకిలో సీఎం చంద్రబాబు నాయుడు గురువారం పర్యటన సందర్భంగా అధికారులు బుధవారం ఏర్పాట్లు పరిశీలించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్‌కుమార్‌మీనా, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీ, గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, జిల్లా ఎస్పీ గంగాధరరావు కల్యాణ మండపంలో ఏర్పాట్లను సమీక్షించారు. ఏడాది పాలనలో సాధించిన విజయాలపై సీఎం గురువారం సాయంత్రం 5 గంటలకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లతో సమావేశమవుతారని అధికారులు తెలిపారు.

మురుగునీటి నిలయాలుగా ఖాళీ స్థలాలు

- దోమలకు కేంద్రాలుగా మారిన వైనం
- అవస్థలు పడుతున్న ప్రజలు
- చర్యలు తీసుకోవాలని వినతి

పాయకాపురం(విజయవాడరూరల్): నగర శివారు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు మురుగునీటి నిలయాలు మారాయి. దోమల ఉత్పత్తికి కేంద్రాలుగా తయారయ్యాయి. స్థలాలు కొనుగోలు చేసిన వ్యక్తులు వాటిని అలానే వదిలేయడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోతున్నాయి. వర్షాలు కురుస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఖాళీ స్థలాలు వర్షపు నీటితో నిండిపోయి పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. దోమలు పెరిగి స్థానికంగా నివాసం ఉంటున్న ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దోమకాటుతో డెంగీ, మలేరియా వంటి ప్రమాదకర జ్వరాల బారిన పడే అవకాశం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

64వ డివిజన్ ముస్లిం కాలనీ ఆనుకొని ఉన్న ఖాళీ స్థలం నిండుకుండలా ఎప్పుడూ మురుగునీటితో తొణికిసలాడుతూ ఉంటుంది. మురుగునీరు నిలబడి వుండటంతో దోమలు చెలరేగి రాత్రిళ్ళు నిద్ర లేకుండా చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా వైరల్ ఫీవర్స్ అధికంగా ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు.

నోటీసులు జారీ చేయాలి.....



64వ డివిజన్లోని స్థలాల్లో నిలిచిన నీళ్లు



కండ్రిక-రాజీవ్‌నగర్లోని ఖాళీ స్థలంలో నీరు

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి మెరక చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ఉడా కాలనీ, ఈడబ్ల్యుఎస్ కాలనీ, కండ్రిక- రాజీవ్‌నగర్ కాలనీ రోడ్డుకు ఇరు వైపులా ఖాళీ స్థలాలు అధికంగా మురుగు నీటితో నిండి ఉన్నాయి. వ్యాపారులు, సంపన్నులు రోడ్ల వెంబడి ఖాళీ స్థలాలను కొనుగోలు చేసి అలాగే ఉంచడంతో వాటిల్లో చెట్లు, ముళ్ళపొదలు పెరిగి పాముల్లాంటి వాటికి నివాసయోగ్యంగా ఉంటున్నాయని జనం భయపడుతున్నారు. అవి రాత్రి వేళల్లో ఇళ్లల్లోకి వస్తున్నాయని సమీపంలో నివాసం ఉంటున్న కుటుంబాల వాళ్లు చెబుతున్నారు. వీఎంసీ అధికారులు ఖాళీ స్థలాల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి మెరక చేసే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలం రావడంతో దోమల బెడద అధికంగా ఉండి అనేక వ్యాధులకు కారణమవుతాయని అంటున్నారు.

వ్యాధులు ప్రబలే ప్రమాదం



ఖాళీ స్థలాల్లో రోజుల తరబడి నీరు నిలబడి ఉండటం వల్ల దోమలు ఉధృతంగా పెరిగి మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బోదకాలు, మెదడువాపు లాంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. తాగునీటి పైపులైనుతో మురుగునీరు కలిస్తే నీరు కలుషితమై కామెర్లు, వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్ వంటి ప్రమాదకర జబ్బుల బారిన ప్రజలు పడే అవకాశం ఉంది.

–డాక్టర్ రాథోడ్, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాజీవ్‌నగర్

వైరల్ ఫీవర్స్‌తో ఇబ్బందులు



ఇళ్ల మధ్య మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు దాడి చేస్తున్నాయి. ఇప్పటికే చిన్నపిల్లలు, వృద్ధులు వైరల్ ఫీవర్స్ బారిన పడి అల్లాడిపోతున్నారు. వీఎంసీ అధికారులు ఖాళీ స్థలాలను మెరక చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. సంబంధిత స్థలాల యజమానులకు తక్షణమే నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలి.

–జి.కోటేశ్వరరావు, సుందరయ్యనగర్,

రక్షిత నీరు సరఫరా చేస్తాం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి గడపకు రక్షిత తాగునీటిని సరఫరా చేస్తామని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 26వ డివిజన్‌లో రూ. 59.74 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన వాటర్ పైపులైన్‌కు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరితో కలిసి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు అధికంగా ఉండే అల్లూరి సీతారామరాజు వంతెన కాలువ గట్టు రోడ్డు నుంచి మాచవరం డౌన్ వరకు రూ. 39.91లక్షలతో, మాగంటి వారి వీధిలో రూ. 19.83 లక్షల వ్యయంతో వాటర్ పైపులైన్ వేయనున్నట్లు తెలిపారు. నాయకులు వల్లభనేని సతీష్, తోట పాండు, కె సత్య, విజయకృష్ణా సూపర్ బజార్‌డైరెక్టర్ కె ప్రకాష్ శశి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల స్థలం పరిరక్షించాలని వినతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన స్థలంలో ఎటువంటి ప్రైవేటు విద్యాసంస్థల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వరాదని, కళాశాల స్థలాన్ని పరిరక్షించాలంటూ పూర్వ విద్యార్థులు బుధవారం వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి సంఘం నాయకులు దోనేపూడి శంకర్, మాజీ డెప్యూటీ మేయర్ చెరుకూరి కృష్ణకుమార్ మాట్లాడుతూ ఎంతో విలువైన కళాశాలను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కోర్టు వివాదంలో ఉన్న స్థలంను పరిరక్షించి 22 1 ఏ సెక్షన్ ప్రకారం ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ కళాశాల స్థలాన్ని పరిరక్షిస్తామని చెప్పారు. ఆ స్థలంలో భవన నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వకుండా నిరాకరిస్తామని హామీ ఇచ్చారు. ప్రణాళిక విభాగపు ఉన్నతాధికారిని కలిసి తమకు సహకరించాలని కోరారు. సంఘ అధ్యక్ష కార్యదర్శులు లంక జానయ్య చిగురుపాటి యుగంధర్, వేజెళ్ళ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అసభ్యంగా మాట్లాడే వారిని బహిష్కరించాలి

మహిళా సంఘాల ఐక్య వేదిక



చర్చాగోష్టిలో మహిళా సంఘాల ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళల పట్ల అసభ్యకర వ్యాఖ్యలు చేసేవారిని ఏ రాజకీయ పార్టీలో ఉన్నా బహిష్కరించాలని మహిళా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఆకాశంలో సగం అని కీర్తించబడుతున్న మహిళా లోకం అన్ని రంగాల్లో వివక్షకు గురవుతుందని వక్తలు పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో, చర్చా వేదికల్లో చులకన భావంతో అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మహిళా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం మహిళలపై వికృత వ్యాఖ్యలు, చర్యలు, నివారణ అనే అంశంపై చర్చాగోష్టి జరిగింది. ఈ చర్చాగోష్టిలో పాల్గొన్న భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ) ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మత్స దుర్గాభవాని, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, కాంగ్రెస్ పార్టీ మహిళా ఉపాధ్యక్షులు పద్మశ్రీ మాట్లాడారు. మాజీ కార్పొరేటర్ శ్రీదేవి, సామాజిక కార్యకర్త డాక్టర్ కె.వసుంధర, వాసవ్య మహిళా మండలి ప్రతినిధి పి.సుహాసిని, ఏపీ మహిళా సమాఖ్య నగర ప్రధాన కార్యదర్శి దుర్గాంబ, హైకోర్టు న్యాయవాది పి.దివ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఫ్లో విజయవాడ చాప్టర్ ప్రారంభం



లబ్బీపేట(విజయవాడతూర్పు): మహిళల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించే లక్ష్యంతో ఏర్పాటైన ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ విజయవాడ చాప్టర్‌ను బుధవారం ప్రారంభించారు. విజయవాడలోని ఓ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఫ్లో జాతీయ అధ్యక్షురాలు పూనమ్ శర్మ పాల్గొన్నారు. ప్రతిభ గల 15 మంది పేద విద్యార్థినులకు సైకిళ్లను బహూకరించారు. చేనేత వస్త్రాలను, కళాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో చేనేత ఉత్పత్తులతో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. పూనమ్ శర్మ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 20 ఫ్లో ఛాప్టర్‌లు ఉన్నాయని, 21వ చాప్టర్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించినట్లు తెలిపారు. విజయవాడ, వైజాగ్, గుంటూరు నగరాల నుంచి 132 మంది సభ్యులు విజయవాడ చాప్టర్‌లో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రష్మీ సరిత, విజయవాడ చాప్టర్ అధ్యక్షురాలు అమ్రిత కుమార్, మెంటార్ పద్మ రాజగోపాల్, గవర్నింగ్ బాడీ సభ్యురాలు ఉషా రాణి మన్నే తదితరులు పాల్గొన్నారు.

దర్శకుడు భరద్వాజకు మహాకవి శ్రీశ్రీ పురస్కారం

విజయవాడ కల్చరల్: మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ, శ్రీశ్రీ సాహిత్యనిధి ఆధ్వర్యంలో 15 వ తేదీన సినీ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజకు మహాకవి శ్రీశ్రీ స్మారక పురస్కారం ప్రదానం చేస్తున్నామని ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు కొల్లూరి, బోడి ఆంజనేయరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గాపురంలోని జీవీఆర్ సంగీత కళాశాలలో ఆదివారం పురస్కారం అందజేస్తునట్లు పేర్కొన్నారు.



బెజవాడ.. విద్యలవాడ..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో విద్యారంగానికి సంబంధించిన అనేక సంస్థలు విజయవాడ కేంద్రంగా పని చేస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంతం విద్యలవాడగా గణతికెక్కింది. ఎన్టీఆర్ జిల్లాలో అనేక విద్యా సంస్థలు విద్యారంగ వికాసానికి పాటుపడుతున్నాయి. జిల్లాలో సుమారుగా 1451 విద్యాసంస్థలు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు పని చేస్తున్నాయి. వాటిల్లో సుమారుగా 3.30 లక్షల మంది విద్యార్థులు ఒకటి నుంచి పదో తరగతి వరకూ చదువుతున్నారు. వాటిలో సుమారుగా 509 వరకూ ప్రైవేట్ విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. విద్యారంగం అభ్యున్నతికి గత ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఆ క్రమంలో ప్రైవేట్ విద్యాసంస్థలతో పోటీగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ విద్యాసంస్థలు అభివృద్ధి బాట పట్టాయి. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అనేక పథకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం మార్పు చేసింది. జిల్లాలో పాఠశాలలతో పాటుగా ఇంజినీరింగ్, మెడికల్, లా, ఆర్కిటెక్చర్, ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి అనేక రకాల విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. ఇవన్నీ విద్యారంగంతో పాటుగా సామాజిక వికాసానికి అండగా నిలుస్తున్నాయి. అలాగే సుమారుగా రెండు వందల వరకూ జూనియర్ కళాశాలలు జిల్లాలో కొనసాగుతుంటే అందులో సుమారుగా 130 వరకూ ప్రైవేట్ జూనియర్ కళాశాలలు పని చేస్తున్నాయి. అదేవిధంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో సుమారుగా 140 వరకూ డిగ్రీ, పీజీ, ఫార్మసీ, బీఈడీ కళాశాలలు కొనసాగుతున్నాయి. అదేవిధంగా సుమారుగా 30 వరకూ ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి.

కౌన్సిల్ అజెండాపై మేయర్ సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): ఈ నెల 13న జరిగే కౌన్సిల్ అజెండా పై నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని ఆమె చాంబర్లో బుధవారం ఆయా శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కౌన్సిల్ అజెండా, అడిషనల్ అజెండా ఉన్న ప్రతిపాదనలను చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సభ్యులు ఇచ్చిన ప్రతిపాదనలను అధికారులు అందరూ సహకరించాలని కోరారు. ప్రజల కోసం విజయవాడ నగరపాలక సంస్థ ఎల్లప్పుడూ తోడుగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, ఎస్ఈలు పి.సత్యకుమారి, పి.సత్యనారాయణ, ఈఈలు సురేఖ, శ్రీనివాస్‌రెడ్డి, సామ్రాజ్యం, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) పి.వెంకటనారాయణ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ చక్రవర్తి, జాయింట్ డైరెక్టర్ (అమృత్), ఎస్టేట్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ డాక్టర్ లత, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, వీఏఎస్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.